క్లుప్తంగా

ఆలమూరులో వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి

రుద్రవరం: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఆలమూరు పీహెచ్‌సీలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు అమర్నాథ్‌రెడ్డి, నాగ శ్రీజారెడ్డి మహిళలు, కిశోర బాలికలకు పలు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే గైనకాలజిస్టు సుధామణి గర్భిణులకు వైద్య సేవలు అందించారు. జిల్లా వైద్యులు కాంతారావు నాయక్, జగదీష్ చంద్రారెడ్డి కార్యక్రమాన్ని పరిశీలించి మహిళలకు పలు సూచనలు చేశారు.

ప్రథమనంది ఆలయంలో స్వచ్ఛ భారత్



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అభిరుచి మధు ఆధ్వర్యంలో గురువారం ప్రదమనంది దేవస్థానంలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణ, శుభ్రత చైతన్యం పెంపొందించడమే తమ లక్ష్యమన్నారు. అనంతరం దేవస్థాన పరిసరాలను శుభ్రం చేసి, వ్యర్థాలను తొలగించారు. నాయకులు కొశెట్టి చంద్రశేఖర్, నిమ్మకాయల సుధాకర్, లక్ష్మిరెడ్డి, ఉపేంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పద్మావతి నగర్‌లోని పింగళి సూరన స్మారక శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠకులను అడిగి గ్రంథాలయములో వసతుల గురించి తెలుసుకున్నారు. పాఠకులు మాట్లాడుతూ.. చదువుకునేందుకు ప్రత్యేక స్టడీ హాల్, పోటీ పరీక్షలకు సంబంధించిన కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరారు. త్వరలో తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. గ్రంథాలయ నిర్వహణ, సిబ్బంది సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఆర్‌ఈ శ్రీధర్ పాల్గొన్నారు.

కబడ్డీ కోచింగ్ ప్రారంభం



శిక్షణ పొందుతున్న బాలికలు

నంద్యాల(న్యూటౌన్): ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు ఎన్‌టీఆర్ జిల్లా గొల్లపూడిలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు పాణ్యం మండలంలోని విజయానికేతన్, గడివేముల హైస్కూల్‌లో శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం విజయానికేతన్ క్రీడా మైదానంలో బాలబాలికలకు కోచింగ్ క్యాంపును ఈనెల 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ప్రభాకర్, చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యుడు షహలాం కోరారు. స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో గురువారం పలువురు మహిళలు, చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదు

నంద్యాల: నంద్యాల మెడికల్ కళాశాల వద్ద ర్యాలీలు, సమావేశాలకు అనుమతి లేదని నంద్యాల ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో చలో మెడికల్ కాలేజ్ పేరుతో నిరసన చేస్తున్నట్లు తమకు సమాచారం ఉందని, అయితే ఈ కార్యక్రమానికి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన

ఆళ్లగడ్డ: ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని వైద్యాధికారి చేతన సూచించారు. గురువారం అహోబిలం ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు.







క్రిష్ణిపాడులో నీటమునిగిన కందిపంటను చూపుతున్న రైతు, ఇళ్ల ముందు ప్రవహిస్తున్న వర్షపు నీరు, క్రిష్ణిపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కుందూనది

భారీ వర్షం.. అతలాకుతలం

దొర్నిపాడు: మండలంలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా కురవడంతో మినుము, కంది, వరి పంటలు పూర్తిగా నీట మునిగాయి. అలాగే క్రిష్ణిపాడు గ్రామంలో ఇళ్లలోకి నీరు వెళ్లడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఇక కుందూనది ఉప్పొంగి ప్రవహిస్తోంది.



దొర్నిపాడులో నీట మునిగిన వరి పంట

సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం

నంద్యాల: ఇల్లు లేని, అర్హత గల కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడం ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 అంగీకార్ –2025 లక్ష్యమని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 2.0 అంగీకార్ బ్రోచర్‌ను గురువారం తన చాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ శేషన్న, హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ఆధార్, రేషన్ కార్డు కలిగి, ఎన్‌బీఎం పోర్టల్‌లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి పీఎంఏవై (యూ), ఎన్‌టీఆర్ నగర్ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రూ.1.5 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష కలిపి రూ.2.5 లక్షల సబ్సిడీ అందిస్తాయని చెప్పారు. దేశంలో ఒక్క అర్హుడైనా ఇల్లు లేకుండా ఉండకూడదనే సంకల్పంతో అంగీకార్ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. సెప్టెంబర్ 4న ఢిల్లీలో జాతీయ స్థాయిలో ఈ కార్యక్రమం ప్రారంభమైందని, పీఎంఏవై(యూ) 2.0 ప్రారంభించి సంవత్సరం పూర్తయిన సందర్భంలో సెప్టెంబర్–అక్టోబర్ నెలలను 'హౌసింగ్ నెలలుగా' నిర్వహిస్తున్నారని చెప్పారు. అంగీకార్ – 2025 ప్రచారంలో భాగంగా ఇల్లు లేని పేదలను గుర్తించి గృహ యజమానులుగా చేయడం, బ్యాంక్ లోన్ సౌకర్యం కల్పించడం, రిజిస్ట్రేషన్ చేయించడం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడం ప్రధాన అంశాలుగా కొనసాగుతాయని వెల్లడించారు.



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

పేదలకు స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలో ఇల్లు లేని నిరుపేదలకు స్థలాలు ఇచ్చేంత వరకు సీపీఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామాంజనేయులు, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. గురువారం పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాల ఆవరణలో మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, నాలుగు విడతల్లో సచివాలయాల ఎదుట తహసీల్దార్ కార్యాలయాల ఎదుట 4వేల మందితో అర్జీలు ఇచ్చి ధర్నా చేశామని చెప్పారు. సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ అధికారులు, తహసీల్దార్లు అర్జీలను పరిశీలించడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం చెప్పిన విధంగా పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇచ్చి పక్కా ఇంటికి రూ.5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా సమాఖ్య పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షులుగా సరోజమ్మ, రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా సుశీలమ్మ, సహాయ కార్యదర్శులుగా రమిజాబీ, వరాలు, కోశాధికారిగా సునితతో పాటు 21 మందిని ఎన్నుకున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, సోమన్న పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

స్టాంప్ వెండర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న స్టాంప్ వెండర్లు

నంద్యాల(అర్బన్): దస్తావేజు లేఖరుల సమస్యలు పరిష్కరించాలని నంద్యాల జిల్లా స్టాంప్ రైటర్స్ అండ్ వెండర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఫరూక్, రమేష్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ఎన్‌కే రోడ్డులో నిరసన దీక్షను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అనుసరిస్తున్న 2.0 విధానం అయోమయానికి గురి చేస్తుందన్నారు. ఆటో మ్యూటేషన్ సిస్టమ్ మంచిదైనా.. డిపార్టుమెంట్‌లో సమన్వయ లోపం వల్ల ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. పీడీఈ విధానానికి వ్యతిరేకం కాదని, అందులోని లోపాలను సరిదిద్దాలని కోరారు. ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన 2.0 విధానం వల్ల ప్రజలకు, దస్తా వేజు లేఖరులకు అసౌకర్యం కలుగుతోందన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రామకృష్ణ, గిరిబాబు, సుబ్రమణ్యం, శివరాం పాల్గొన్నారు.

ఆజాద్ సర్కిల్‌లో బార్ వద్దు

నంద్యాల(అర్బన్): అపార్ట్‌మెంట్లు, పాఠశాలలు, ఆసుపత్రుల్లు, బ్యాంకులు, హోటళ్లతో రద్దీగా ఉండే మౌలానా అబుల్‌కలాం ఆజాద్ సెంటర్‌లో బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేస్తే ఊరుకునేది లేదని ముస్లిం సంఘాల నాయకులు, కౌన్సిలర్లు హెచ్చరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ పేరున ఏర్పాటైన ప్రాంతంలో బార్ ఏర్పాటు చేయాలనుకోవడాన్ని నిరసిస్తూ వారు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కౌన్సిలర్ చింపింగ్ బాసిత్, మౌలానా రహమతుల్లా మాట్లాడుతూ ఈ ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుందని చెప్పారు. బార్ ఏర్పాటు దుర్మార్గమన్నారు. ఆలోచనను విరమించుకోకపోతే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. అనంతరం జిల్లా ఎక్సైజ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అబులైజ్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ముస్లింలు

నేడు బాక్సింగ్ ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీన పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్ ఫెడరేషన్ నంద్యాల జిల్లా సెక్రటరీ విశ్వనాథ్, మహిళా సెక్రటరీ ఆశాజ్యోతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17 బాల బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాజరయ్యే క్రీడాకారులు హెచ్‌ఎం సంతకంతో ఎలిజిబులిటీ ఫారం తీసుకొని రావాలని సూచించారు.

విద్యార్థులకు దంత పరీక్షలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక పద్మావతినగర్‌లోని మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు మల్లీశ్వరి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సభ్యురాలు డాక్టర్ ఈశ్వరి సహకారంతో 130 మంది విద్యార్థులకు దంతాల పరీక్ష చేసి, దంతాల శుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారని చెప్పారు. అనంతరం విద్యార్థులు టూత్ బ్రష్‌లు పంపిణీ చేశారు. డాక్టర్ వరుణ్, సభ్యులు సుశీల, విజయలక్ష్మి, నాగమణి, విజయకుమారి, నిర్మల పాల్గొన్నారు.

నంద్యాలలో చోరీలు

నంద్యాల: పట్టణంలోని విశ్వనగర్, సాయిబాబానగర్ ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి చోరీలు జరిగినట్లు నంద్యాల టూటౌన్ సీఐ అస్రార్ బాషా గురువారం తెలిపారు. వివరాలు..సాయిబాబానగర్‌లోని మెయిన్ రోడ్డులో ఉన్న అంజనా సూపర్‌మార్కెట్లో దొంగలు షర్టర్ తాళాలు పగలగొట్టి రూ.30వేలు ఎత్తుకెళ్లారన్నారు. అలాగే విశ్వనగర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర దుకాణంలో సైతం షాపు షర్టర్ తాళాలు పగలగొట్టి రూ.15వేలు చోరీ చేశారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

22 నుంచి దేవీనవరాత్రులు

దొర్నిపాడు: ఈనెల 22వ తేదీ నుంచి స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో దేవి నవరాత్రులను నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రామసుబ్బయ్య గురువారం తెలిపారు. 22న రాజరాజేశ్వరి, 23న అన్నపూర్ణదేవి, 24న గాయత్రీదేవి, 25న బాల త్రిపుర సుందరీదేవిగా, 26న లలితాదేవి తోటోత్సవం, 27న మహాలక్ష్మిదేవి, 28న శారదాదేవి, 29న సరస్వతీదేవి 30న మహిషాసురమర్దిని, అక్టోబర్ 1న దుర్గాదేవి, 2న విజయలక్ష్మి, 3న వసంతోత్సవం చేయనున్నట్లు వివరించారు.

'చలో మెడికల్ కాలేజీ' విజయవంతం చేయండి





నంద్యాలలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు

గోస్పాడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటైన మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ..శుక్రవారం నిర్వహించ తలపెట్టిన చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్ యాదవ్ కోరారు. గురువారం వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చలో నంద్యాల మెడికల్ కాలేజీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులు,యువజన సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. గోపీ, కోటి, భరద్వాజ్, బాలు, మస్తాన్, అజయ్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మాజీ నాయకుడు సన్నాల సాయిరాంరెడ్డి కోరారు. గురువారం పట్టణంలోని గిరినాథ్ సెంటర్‌లో విద్యార్థులతో కలిసి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు యువరాజ్, ప్రవీణ్, రాజు, బాషా, సంపత్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(అర్బన్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) నాయకులు లక్ష్మీకాంత రెడ్డి, కృపావరం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్‌ఈ కార్యాలయ ఆవరణలో భోజన విరామ సమయంలో పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహించి నల్లబ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లు, కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చులు చెల్లించాలని, 1999 ఫిబ్రవరి నుంచి 2004 ఆగస్టు 31 మధ్య చేరిన ఉద్యోగులకు పెన్షన్ కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం 19, 20 తేదీల్లో రిలే నిరాహార దీక్షలకు వెళ్తున్నామని చెప్పారు. 22న ర్యాలీగా వెళ్లి జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తామన్నారు. డీ2 ఏఈ రామయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

రక్తదానం



రక్తదానం చేస్తున్న శిల్పా అభిమానులు

బొమ్మలసత్రం: మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం విజయబ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అలాగే.. పట్టణ శివారులోని ఎస్సార్బీసీ కాలనీలో ఉన్న పరివర్తన లైఫ్‌సెంటర్‌లో అనాథ చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేసి, అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దాల్‌మిల్ అమీర్‌బాషా, కౌన్సిలర్ కృష్ణమోహన్, మాజీ కౌన్సిలర్‌లు కిరణ్, లక్ష్మీనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్ రెడ్డి, మున్సిపల్ వింగ్ అధ్యక్షులు టైలర్ శివయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే. సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో సెంటర్‌లోని చిన్నారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి కేక్‌కట్ చేసిన అనంతరం విద్యార్థులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు.

వరద బాధితులకు ఆర్థిక సహాయం

ఉయ్యాలవాడ: ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి అన్నారు. గురువారం హరివరం గ్రామంలో భారీ వర్షం కారణంగా జలమయమైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. వర్షపు నీరు గృహాల్లోకి చేరి నష్టపోయిన 5 కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట పార్టీ మండల కన్వీనర్ బుడ్డా చంద్రమోహన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జెల కృష్ణారెడ్డి, నర్సిపల్లె సర్పంచ్ పల్లె గురుప్రసాద్‌రెడ్డి, ఉప సర్పంచ్ ఎర్రి శ్రీనివాసరెడ్డి, సహకార పరపతి సంఘం మాజీ చైర్మన్లు పల్లె మహేశ్వరరెడ్డి, బుడ్డా విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సర్పంచ్ పోచా రాధాక్రిష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హరివరంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేస్తున్న భూమా కిశోర్‌రెడ్డి

లారీ అసోసియేషన్ పేరుతో రైతులపై భారం

ఆళ్లగడ్డ: లారీ అసోసియేషన్ పేరుతో రైతులపై భారం మోపేందుకు అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి భూమా కిశోర్‌రెడ్డి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆళ్లగడ్డలో ఎన్నో అక్రమాలకు పాల్పడిన తరువాత చివరకు రైతులతో వ్యాపారం చేసేందుకు దిగడం సిగ్గుచేటన్నారు. అకాల వర్షాలతో మొక్కజొన్న రైతులు తీవ్ర నష్టపోయారని, వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న కిషోర్‌రెడ్డి

నంద్యాలకు తహసీల్దార్ కావాలి!

- అర్బన్, రూరల్‌కు ఒక్కరే తహసీల్దార్
- ఎస్ఆర్‌బీసీ ఎల్‌ఏడీటీకి రెండు కార్యాలయాల ఎఫ్‌ఏసీ బాధ్యతలు
- టీడీపీ నాయకుల అక్రమాలకు సహకరించని గత అర్బన్ తహసీల్దార్
- 'పనులు' చేయని వారు స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని మంత్రి ఆదేశం!

తమకు నచ్చని,.. తమ పనులను చేసిపెట్టని అధికారులంటే కూటమి నాయకులకు నచ్చడం లేదు. అలాంటి వారిని స్వచ్ఛందంగా వెళ్లిపోవాలని ఆదేశిస్తున్నారు కూడా. నంద్యాల అర్బన్ తహసీల్దార్ తమకు అనుకూలంగా ఉండటం లేదని పంపించేసి తమకు వత్తాసు పలికే అధికారిని ఇతర శాఖ నుంచి ఏరికోరి తెచ్చుకొని అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాల బాధ్యతలను అప్పగించారు. దీంతో వారి 'పనులన్నీ' నిరాటంకంగా సాగుతున్నాయి. ఫుల్ అడిషనల్ చార్జ్‌తో విధులు నిర్వర్తిస్తున్న సదరు అధికారి మూడు చోట్ల విధులు బాధ్యతలు చూస్తుండటం విశేషం. అయితే రెగ్యులర్ అధికారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నంద్యాల(అర్బన్): జనాభా పెరుగుదలలో భాగంగా ప్రభుత్వం నంద్యాల తహసీల్దార్ కార్యాలయాన్ని ఇటీవల అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలుగా ఏర్పాటు చేసింది. నంద్యాల పట్టణంతో పాటు ఏడు గ్రామాలు, రూరల్‌లో 13 గ్రామాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో 48,236 నివాస గృహాలు, 2.82 లక్షల మంది జనాభా ఉన్నారు. పాత తహసీల్దార్ కార్యాలయ వెనుక భాగంలో ఈ ఏడాది జనవరి 6న నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న రామచంద్రారావు రూరల్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తారని 5వ తేదీ సాయంత్రం వరకు హడావుడి చేశారు. కూటమి పార్టీ నాయకులతో పాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు, అధికారులకు డీటీ ఫోన్లు చేసి బాధ్యతలు చేపట్టే కార్యక్రమానికి రావాలంటూ స్వయంగా ఆహ్వానించారు కూడా. అయితే.. రాత్రికి రాత్రే ఏమైందో ఏమో కానీ తహసీల్దార్ ఎంపికలో జరిగిన హైడ్రామాలో ఎస్సార్బీసీ ల్యాండ్ అక్విషన్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పత్తి శ్రీనివాసులు రూరల్ తహసీల్దార్‌గా (ఎఫ్‌ఏసీ) బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో అర్బన్ తహసీల్దార్‌గా ప్రియదర్శిని విధుల్లో ఉన్నారు. మంత్రి ఫరూక్‌కు మిత్రుడైన పాణ్యం రామయ్యకు పత్తి శ్రీనివాసులు మనువడు కావడంతో పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలున్నాయి. కూటమి నేతలు టచ్‌లో ఉండటంతో ఫుల్ అడిషనల్ చార్జీతో రెండు కార్యాలయాల నిర్వహణ బాధ్యతలు పత్తి శ్రీనివాసులు నిర్వర్తిస్తున్నారు. ఎస్సార్బీసీలో జీతం తీసుకుంటూ ఎఫ్‌ఏసీతో రెండు తహసీల్దార్ కార్యాలయాల విధులు చూస్తున్నారు.



నంద్యాల అర్బన్ తహసీల్దార్ కార్యాలయం

తహసీల్దార్‌ను వెళ్లిపోవాలన్న మంత్రి..!

శ్రీనివాసులు కంటే ముందు అర్బన్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రియదర్శిని ముక్కుసూటి మనస్తత్వం గల అధికారిణి. డబ్బు, రెకమెండేషన్లను లెక్క చేయకపోగా, అవినీతి పనులకు ఆమడ దూరంలో ఉండేది. కూటమి నాయకులకు అవసరమైన పనులు చేయాలని, ఖాళీ స్థలాల్లో టీడీపీ కార్యకర్తలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలంటూ స్వయాన మంత్రి ఫరూక్ ఫోన్ చేసి చెప్పినా ఆమె పెడచెవిన పెట్టింది. తమకు సహకరించడం లేదనే అక్కసుతో..ఒకానొక సందర్భంలో మంత్రి మాట్లాడుతూ పనులు చేయని అధికారులు స్వచ్ఛందంగా బదిలీపై వెళ్లాలంటూ ప్రియదర్శినిని ఉద్దేశించి మాట్లాడటం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అయితే తనను ఎవరైనా బదిలీ చేసుకోవచ్చని, నిబంధనలకు విరుద్ధంగా తాను ఏ పని చేయనని ప్రియదర్శిని స్పష్టం చేయడం విశేషం.

కూటమి నేతల పనులు చకచకా..

రెండు తహసీల్దార్ కార్యాలయాల్లో ఎలాంటి పనులున్నా చకచకా చేయించుకోవచ్చన్న ఉద్దేశంతోనే ఒకే తహసీల్దార్ ఉండేలా కూటమి నేతలు ప్రణాళికలు రచించారు. తద్వారా సొంత పనులతో పాటు ఇతర పనులనూ సులభంగా చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే తాము అనుకున్న పనులన్నింటినీ చేయించుకున్నారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం శ్రీనివాసులు పర్యవేక్షణలో ఉన్న రూరల్ తహసీల్దార్ కార్యాలయానికి మరొకరికి పోస్టింగ్ ఇస్తారా.. లేక కొంత కాలం పాటు వేచి చూసే ధోరణిని అధికారులు అవలంభిస్తారోననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి నాయకుల ఒత్తిళ్లతోనే మరొకరికి పోస్టింగ్ ఇవ్వడం లేదని చర్చ జరుగుతోంది. అయితే రెగ్యులర్ తహసీల్దార్లు లేక పట్టణ, రూరల్ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదేమైనా అధికంగా జనాభా ఉన్న నంద్యాల జిల్లా కేంద్రానికి రెగ్యులర్ తహసీల్దార్లను ఏర్పాటు చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

సంక్షిప్తం

హరివరం గ్రామాన్ని సందర్శించిన అధికారులు

ఉయ్యాలవాడ: హరివరం గ్రామంలోని ఎస్సీ కాలనీ భారీ వర్షంతో జలమయమైంది. తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఎస్ఐ రామిరెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు గురువారం కాలనీని సందర్శించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వర్షంతో 5 కుటుంబాల ఇళ్లలోని సరుకులు తడవగా, ప్రతి కుటుంబానికి 25 కేజీల బియ్యం, 2 కేజీల చక్కెర, 5 కేజీల కందిపప్పు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.



సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు

క్రీడా దుస్తులు పంపిణీ

శిరివెళ్ల: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులకు గురువారం క్రీడా దుస్తుల పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు యామా గుర్రప్ప వీటిని విరాళంగా అందజేసినట్లు హెచ్‌ఎం గోవిందరాజులు తెలిపారు. పాఠశాలలో విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

పశువులకు గర్భకోశ చికిత్స

ఉయ్యాలవాడ: హరివరం గ్రామంలో రాష్ట్రీయ గోకుల పథకం కింద గురువారం పాడి పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. ఆళ్లగడ్డ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య, ఏడీఏ వరప్రసాద్, పశువైద్యాధికారి రవీంద్రనాథ్‌రెడ్డి ఉచితంగా మినరల్ మిక్సర్, టానిక్‌లు పంపిణీ చేశారు.



హరివరంలో పశువులకు చికిత్స చేస్తున్న ఏడీఏ